క్లుప్తంగా

మధ్యాహ్న భోజన పథకం తనిఖీ

నిమ్మనపల్లె : మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ గుండ్లబురుజు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మండల విద్యాశాఖాధికారి రాజగోపాల్ మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. జగనన్న గోరుముద్దలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం తప్పనిసరిగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని హెచ్ఎంను ఆదేశించారు.

ఒకేషనల్ కోర్సులను అనుమతి

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం కురవంకలోని ఎన్జీఆర్ జూనియర్ కాలేజీలో ఒకేషనల్ కోర్సులకు మెడికల్ కౌన్సిల్ అనుమతి ఇచ్చినట్లు కాలేజీ కరస్పాండెంట్ ఎన్.జీ రామచంద్రారెడ్డి తెలిపారు. కాలేజీలో డిఎంఎల్టీ, అనస్థీషియా(డీఎఎన్ఎస్), ఎక్స్రే(డీఆర్బీఏ) కోర్సులకు అనుమతిచ్చినట్లు తెలిపారు. కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్లు జరుగుతాయన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సారా ఊట ధ్వంసం

ములకలచెరువు: ములకలచెరువు సర్కిల్ పరిధిలోని పెద్దమండ్యం మండలం బండకింద తండా పరిసర ప్రాంతంలో సారా ఊట ధ్వంసం చేసినట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక శుక్రవారం తెలిపారు. సీఐ కథనం మేరకు.. బండకింద తండా సమీపంలో నాటుసారా వండుతున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బంది దాడులు నిర్వహించినట్లు తెలిపారు. సుమారుగా 200 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసి నిందితురాలు బి.నీలావతిని అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు చెప్పారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే

పీలేరు రూరల్ : స్థానిక బహుజన సంక్షేమ సంఘం కార్యాలయలో శుక్రవారం ఎలక్ట్రీషియన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు బలరాం మాట్లాడుతూ థామస్ అల్వా ఎడిసన్ బల్బును కనుగొన్న రోజును ఎలక్ట్రీషియన్ డేగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించి అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అఫీజుల్లా, ప్రభాకర్రాజు, రసూల్, నఫీస్, మహబూబ్బాషా, రవి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

104 సేవలను సద్వినియోగం చేసుకోండి

పెద్దతిప్పసముద్రం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 104 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న సూచించారు. శుక్రవారం వారు మాట్లాడుతూ 104 సిబ్బంది వారికి కేటాయించిన షెడ్యూల్ ప్రకారం మండలంలోని అన్ని పంచాయతిలో పర్యటించి రోగులకు వైద్య సేవలు అందించి మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నరన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులతో పాటు సీజనల్ వ్యాధులకు కూడా వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

పెయ్యదూడ బహూకరణ



ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యుడు గోపాలకృష్ణకు పెయ్యదూడను అప్పగిస్తున్న దాతలు

నిమ్మనపల్లె : మండలంలోని తవళం నేలమల్లేశ్వరస్వామి దేవస్థానానికి శుక్రవారం నిమ్మనపల్లెకు చెందిన శంకర, చంద్రకళ దంపతులు పెయ్యదూడను బహుకరించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు గోపాలకృష్ణకు పెయ్యదూడను అందజేశారు. ఆలయ పూజారి శంకరశాస్త్రి దాతలకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

మదనపల్లె : వరకట్న వేధింపులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. పట్టణంలోని నీరుగట్టువారిపల్లె మాయాబజార్కు చెందిన హరితకు 14 ఏళ్ల క్రితం వెంకటేష్తో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే వెంకటేష్ ఇటీవల మద్యం, జూదానికి బానిసై తరచూ బానిసను వేధింపులకు గురిచేస్తున్నాడు. పుట్టింటి నుంచి డబ్బు తేవాలంటూ భార్యను వేధించడంతో విసిగిపోయిన బాధితురాలు హరిత టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడు వెంకటేష్పై భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కమనీయం..శ్రీవారి కల్యాణం



సర్వభూపాల వాహనంపై స్వామివారి ఊరేగింపు



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో ఏడు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం అర్చకులు క్రిష్ణ ప్రసాద్బట్టార్, రాఘవేంద్రస్వామి, రమేష్బాబు సర్వభూపాల వాహనంపై శ్రీదేవి,భూదేవి సమేత స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. సర్వభూపాల వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. రాత్రి శ్రీవారి కల్యాణం కనువిందుగా, సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించి తరించారు. స్థానిక ఆర్ఎంపీ డా.రమణారెడ్డి స్వామివారి ఉత్సవ విగ్రహాల అలంకరణకు సుమారు రూ.40వేలు విలువ గల కిరిటాలు, పట్టువస్త్రాలు బహూకరించారు. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఆలయ ఇన్స్పెక్టర్ రెడ్డిభాస్కర్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

మదనపల్లె సిటీ: విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వైఎస్సార్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ విద్యకు ఏ ప్రభుత్వం ఇవ్వని నిధులు ఇచ్చారన్నారు. నాడు-నేడు కింద ప్రభుత్వ బడుల స్వరూపం మారిపోయినట్లు తెలిపారు. అమ్మ ఒడి, జగనన్నవిద్యా కానుక, గోరుముద్ద వంటి కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ తరహాలో ఫలితాలు వస్తున్నట్లు పేర్కొన్నారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పద్మావతి, ల్యాబ్ ఇన్చార్జ్ నాగజ్యోతి, పీడీ రాంబాబు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ల్యాబ్ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

ఎమ్మెల్సీ అభ్యర్థికి ప్రచారం

రాయలసీమ తూర్పు నియోజకవర్గ వైఎస్సార్టీఎఫ్ బలపరిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖరరెడ్డికి మద్దతుగా ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి ప్రచారం శుక్రవారం చేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

సచివాలయాల్లో మెరుగైన సేవలు

– డీఎల్డీఓ లక్ష్మీపతి

నిమ్మనపల్లె : గ్రామ సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలందించాలని డీఎల్డీఓ లక్ష్మీపతి అన్నారు. శుక్రవారం నిమ్మనపల్లెలోని 1, 2 సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సచివాలయ ఉద్యోగులు క్రమశిక్షణ పాటించాలన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. సచివాలయాల ద్వారా అందే ఆధార్సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా మరింత అవగాహన కల్పించాలన్నారు. సచివాలయ ఉద్యోగులు సెలవుపై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. విధుల్లో భాగంగా క్షేత్రస్థాయిలో వెళ్లేటప్పుడు సిబ్బంది కచ్చితంగా మూమెంట్ రిజిస్టర్లో నమోదు చేయాలన్నారు. ఆన్లైన్ లావాదేవీల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లీలామాధవి, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్డీఓ లక్ష్మీపతి

పురస్కార గ్రహీతలకు సన్మానం



శ్రీధర్రెడ్డిని సత్కరిస్తున్న ఎస్ఈ సీఆర్రాజగోపాల్ తదితరులు

మదనపల్లె : హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) కార్యాలయ ఉద్యోగులు కే.శ్రీధర్రెడ్డి, వీఎస్పీ.లింగారెడ్డి సేవలను గుర్తించి రిపబ్లిక్ డే సందర్భంగా ప్రతిభా పురస్కారాలు అందుకోవడంపై స్థానిక కార్యాలయంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ సీ.ఆర్.రాజగోపాల్ పురస్కార గ్రహీతలను సన్మానించారు. కార్యాలయంలోని ప్రతి ఉద్యోగి వీరిని స్ఫూర్తిగా తీసుకుని విధుల్లో ప్రతిభ కనపరచాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్ సెక్రటరీ పి.రామచంద్రారెడ్డి, ట్రెజరర్ రాజామణి, అసోసియేట్ ప్రెసిడెంట్ చంద్రాయుడు, వైస్ప్రెసిడెంట్ జయలక్ష్మిరెడ్డి, ఈశ్వరయ్య, చెన్నయ్య, బాలరాజు, పాండురంగ, రమేష్, చిన్నపురెడ్డి, మధుసూధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేల ద్వారా విస్తృత సేవలు

గుర్రంకొండ: ఆర్బీకేల ద్వారా రైతులకు విస్తృత సేవలు అందించనున్నట్లు మండల వ్యవసాయాధికారి రత్నమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని సంగసముద్రం, ఎల్లుట్ల ఆర్బీకేలను ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా రైతులకు మార్కెట్ ధరలు తెలిపే కియోస్ యాప్ను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన పంటలు, ఇతర కూరగాయాల మార్కెట్లో ఏరోజుకారోజు ఎంత ధరలు ఉన్నాయో ఆర్బీకేల్లోనే తెలుసుకోవచ్చన్నారు. ఆర్బీకేల్లో రికార్డులను, రిజిష్టర్లను తనిఖీ చేశారు. పొలాలకు వెళ్లి ఈక్రాప్ బుకింగ్ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తాము సాగుచేసిన పంటల ధరలను తెలుసుకోవడానికి గతంలోలాగా ఇబ్బంది పడాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం సరఫరా చేసే సబ్సిడీ ఎరువులను రైతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు అవసరమైన సబ్సిడీ పొటాష్, యూరియాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీఈఓలు సమీనా, రిజ్వానా, రైతులు పాల్గొన్నారు.



యాప్లో మార్కెట్ల ధరలు తెలియజేస్తున్న ఏఓ

గర్భిణుల్లో రక్తహీనత నివారించాలి

– ఐసీడీఎస్ ఇన్చార్జ్ పీడీ ధనలక్ష్మి

మదనపల్లె : గర్భిణుల్లో రక్తహీనతను నివారించేలా వారికి అవగాహన కల్పించి, పోషకాహార లోపం కలిగిన పిల్లల గృహ సందర్శనలు తప్పనిసరిగా చేయాలని అంగన్వాడీ వర్కర్స్ని ఐసీడీఎస్ ఇన్చార్జ్ పీడీ ధనలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం మదనపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సందర్శనలో భాగంగా అమ్మచెరువుమిట్ట-1,2 అంగన్వాడీ కేంద్రాలను పీడీ ధనలక్ష్మి సందర్శించారు. స్టాక్రూమ్, స్పాట్ ఫీడింగ్, ఆహారం, అంగన్వాడీ కేంద్ర పరిసరాలను పరిశీలించారు. అమ్మచెరువుమిట్టలో జరుగుతున్న సెక్టార్ మీటింగ్కు హాజరై ఎస్డీజీ ఇండికేటర్స్ ప్రతి ఒక్కరూ రీచ్ అవ్వాలన్నారు. వైఎస్ఆర్ఎస్పీ యాప్స్, రిజిస్టర్ రెండింటిలోనూ ఎన్రోల్ అవ్వాలన్నారు. ప్రతినెలా అంగన్వాడీ వర్కర్స్ పోషణ్ట్రాకర్ యాప్లో అప్డేటెడ్గా డీటైల్స్ నమోదు చేయాలన్నారు. గర్భిణులు, బాలింతల గృహాలు సందర్శించినప్పుడు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిందిగా తెలపాలన్నారు. మెనూ ప్రకారం అంగన్వాడీ కేంద్రాల్లో వండి ప్రీస్కూల్ పిల్లలకు, తల్లులకు పౌష్టికాహారం అందించాలన్నారు. ప్రీస్కూల్ పిల్లలు 100 శాతం పాఠశాలకు వచ్చేలా చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ సుజాత, సూపర్వైజర్స్ రమణమ్మ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.



అంగన్వాడీ పిల్లలతో మాట్లాడుతున్న పీడీ ధనలక్ష్మి

ఏకాగ్రతతో వాహనాలు నడపాలి



మాట్లాడుతున్న ఎంపీవీ విజయకుమారి

పీలేరు రూరల్ : డ్రైవర్లు బాధ్యతతో విధులు నిర్వహించాలని ఎంపీవీఐ విజయకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ గ్యారేజ్లో రోడ్డు భద్రతా వారోత్సవాల సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రైవర్లు ప్రశాంత వాతావరణంలో విధులకు హాజరు కావాలని కోరారు. ఏకాగ్రతతో వాహనాన్ని నడపాలని సూచించారు. ఎక్కువ శాతం మానవ తప్పిదాలతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. డ్రైవర్లు సెల్ఫోన్లో మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. బస్సులోని ప్రయాణికుల ప్రాణాలు మీ చేతుల్లో ఉంటాయని గ్రహించాలని తెలిపారు. సురక్షితంగా గమ్యస్థలాలకు చేరుకోవడానికి జాగ్రత్త వహించాలన్నారు. సమావేశంలో డీఎం కుమార్, సీఐ ధనుంజయులు, గ్యారేజ్ ఎంఎఫ్ హరినాథరెడ్డి, ఎస్టీఐ సుధాకర్నాయక్, పలువురు కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో మరింత అభివృద్ధి

తంబళ్లపల్లె: దాతల సహకారంతో ప్రభుత్వ బడులు మరింత అభివృద్ధి చెందుతాయని మండల విద్యాశాఖ అధికారి త్యాగరాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గంగిరెడ్డిపల్లెలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో మదనపల్లెకు చెందిన వ్యాపారవేత్త సిద్దారెడ్డి విద్యార్థులకు రూ. 10 వేలు విలువ చేసే విద్యా సామగ్రి ఉచితంగా అందజేశారు. ఎంఈఓ మాట్లాడుతూ ఇదే పాఠశాలలో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకున్న సిద్దారెడ్డి పాఠశాలకు తన వంతు సహాయం అందించారన్నారు. ప్రతి ఏడాది పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేస్తున్నారన్నారు. దాత సిద్దారెడ్డి మాట్లాడుతూ పాఠశాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎం జీవీ ప్రసాద్, సర్పంచు లలిత, తులసి, వైస్ సర్పంచు రమేష్రెడ్డి, హెచ్ఎం ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ త్యాగరాజు

రోడ్డు నిబంధనలు పాటించాలి

మదనపల్లె సిటీ: డ్రైవర్లు రోడ్డు నిబంధనలు తప్పకుండా పాటించాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ టు డిపో ఆవరణంలో రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ చేసే సమయంలో సెల్ఫోన్లో మాట్లాడటం చేయకూడదన్నారు. ప్రయాణికులకు భద్రంగా గమ్యాలకు చేర్చాలన్నారు. ఆర్టీసీ సిబ్బందికి డ్రైవింగ్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం వల్ల డ్రైవర్లు సురక్షితంగా వాహనాలు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యూరాలజిస్టు డాక్టర్ తరుణ్కుమార్, డిపో మేనేజర్ ఆర్సీ నిరంజన్, హెడ్కానిస్టేబుల్ రామమూర్తి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి

విద్యార్థులు క్రీడల్లో సత్తాచాటాలి

మదనపల్లె సిటీ: విద్యార్థులు క్రీడల్లో సత్తాచాటాలని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం రెడ్డన్నశెట్టి అన్నారు. శుక్రవారం రోప్స్కిప్పింగ్ రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లే క్రీడాకారులకు జెర్సీలను పంపిణీ చేశారు.ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి పాఠశాలకు మంచి పేరుతేవాలన్నారు. పాఠశాలకు చెందిన క్రీడాకారులు అఖిల్నాయుడు, కెల్విన్జెనట్లు రిపబ్లిక్డే సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీలు సుధాకర్, అన్సర్, దేవకమ్మ, సంగీత పాల్గొన్నారు.



క్రీడాకారులకు జెర్సీలను అందజేస్తున్న హెచ్ఎం రెడ్డన్నశెట్టి

స్వాతంత్ర్యోద్యమంలో పత్రికలది కీలకపాత్ర

పీలేరు : స్వాతంత్ర్యోద్యమంలో పత్రికలు కీలక పాత్ర పోషించాయని ఎస్వీయూ తెలుగు విశ్రాంత ఆచార్యులు మేడిపల్లి రవికుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక సంజయ్గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత స్వాతంత్రోద్యమంలో తెలుగు పత్రికలు, జర్నలిజం పాత్రపై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయోద్యమ ఏకీకరణ పత్రికలతోనే సాధ్యమైందన్నారు. దేశంలోని విభిన్న ప్రాంతాల్లో, విభిన్న రూపాల్లో జరుగుతున్న స్వాతంత్ర్య పోరాటానికి జాతీయోద్యమ రూపునిచ్చి ఉద్యమ లక్ష్యం పక్కదారి పట్టకుండా దిశానిర్దేశం చేసింది పత్రికలేనని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ జీసీజీడీఏ అధ్యక్షులు నరసింహులు, ప్రిన్సిపాల్ సుధాకర్రెడ్డి, అధ్యాపకులు శివరామిరెడ్డి, రమేష్ చంద్రబాబు, వెంకటరత్నం, కవిత, రజిని, తదితరులు పాల్గొన్నారు.



సదస్సు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

అత్యవసర వైద్యసేవలపై అవగాహన

మదనపల్లె : అత్యవసర వైద్యసేవలపై పీహెచ్సీ మిడ్లెవెల్ వర్కర్స్, వెల్నెస్ సెంటర్లలోని సీహెచ్ఓలు అవగాహన కలిగి ఉండాలని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలిదేవి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా ఆస్పత్రిలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆర్ఎంఓ దివాకర్తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మాంజలి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం అందిస్తున్న వైద్యసేవలతో పాటు అదనపు వైద్యసేవలు అందించేందుకు సిబ్బందికి ఐదురోజుల శిక్షణ కార్యక్రమం ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. శిక్షణ కార్యక్రమంలో అత్యవసర సేవలపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శిక్షకులు డాక్టర్లు రమేష్బాబు, రిజ్వాన్, చిన్నరెడ్డెప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెడికల్ సూపరింటెండెంట్ పద్మాంజలిదేవి

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

పెద్దతిప్పసముద్రం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆసుపత్రి అభివృద్ధి నిధుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మహమూద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఆసుపత్రిలో తాగునీటి ప్లాంట్, మహిళా సిబ్బందికి మరుగుదొడ్లు, మీటింగ్ నిర్వహణ గది, ప్రతి నెలా 9న జరిగే గర్భిణుల వైద్య పరీక్షలకు ప్రత్యేక షెడ్డు అవసరమని, కందుకూరు పీహెచ్సీ ఆవరణంలో ఉపాధి నిధులతో ఎగుడు, దిగుడు స్థలాన్ని చదును చేయాలని వైద్య సిబ్బంది కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీడీఓ గిరిధర్రెడ్డి, డాక్టర్ పురుషోత్తం నాయక్, డాక్టర్ అభిలాష్, సర్పంచ్ శంకర్, ఎంపీటీసీ చంద్రశేఖర్,సీహెచ్ఓ లక్ష్మీపతి, హెచ్ఈ సరోజ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలపై చర్చిస్తున్న కమిటీ సభ్యులు

రాయలసీమ ప్రజాప్రదర్శన పోస్టర్ల ఆవిష్కరణ

గుర్రంకొండ: స్థానిక ఎస్వీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో రాయలసీమ ప్రజాప్రదర్శన పోస్టర్లను శుక్రవారం రాయలసీమ విద్యార్థి జేఏసీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో జేఏసీ కన్వీనర్ పొత్తూరి శ్రీకాంత్ మాట్లాడుతూ రాయలసీమను సస్యశ్యామలంగా మార్చుకోవడానికి అందరం ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. సిద్దేశ్వరం వద్ద కృష్ణానదిపై నిర్మించనున్న ఐకానిక్ బ్రిడ్జిని రోడ్డు కమ్ బ్యారేజిగా మార్చాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ నాగమల్లయ్య, భరత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే చర్యలు

మదనపల్లె : ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలపై విద్యార్థి సంఘాలు స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్డీఓ మురళి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాసంవత్సరంకు సంబంధించి పాఠశాలల ఫీజుల వివరాలను గవర్నమెంట్ బాడీ తీర్మానంలో నిర్ణయించిన విధంగా నోటీసు బోర్డుపై పెట్టాలన్నారు. పుస్తకాలు, నోట్బుక్స్, పెన్నులు, యూనిఫాం స్కూల్ యాజమాన్యం విక్రయించరాదన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనల్ని అతిక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేటప్పుడు అన్ని వివరాలతో సంతృప్తి చెందాకే చేర్చాలన్నారు.

'మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు'

గుర్రంకొండ: మైనర్ బాలబాలికలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వదని ఎస్ఐ దిలీప్కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్స్టేషన్ ముందు నాకాబందీ నిర్వహించారు. ద్విచక్రవాహనాలను నడుపుతున్న మైనర్ బాలురను అదుపులోకి తీసుకొని 25 ద్విచక్ర వాహనాలను స్టేషన్కు తరలించారు. పిల్లల తల్లిదండ్రులను పోలీస్స్టేషన్కు పిలపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ పిల్లలకు ద్విచక్ర వాహలను ఇవ్వడం వలన రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశముందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకొంటాని హెచ్చరించారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ దిలీప్కుమార్